ఎన్నికల కౌంటింగ్ కోసం ఏజెంట్ల నియామకం

విశాలాంధ్ర-రణస్థలం మండల తహశీల్దార్ కార్యాలయం ఎచ్చెర్ల నియోజకవర్గం కౌంటింగ్ ప్రక్రియ గురించి, కౌంటింగ్ ఏజెంట్ల నియామకం, కౌంటింగ్ ఏర్పాట్లు, కౌంటింగ్ హాల్ లో ప్రవర్తన మరియు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు తదితర అంశాల మీద రిటర్నింగ్ అధికారి, అందరూ రాజకీయ పార్టీల తో ఆర్వో లక్ష్మణమూర్తి బుధవారం సమావేశం నిర్వహించారు.

జయరామచంద్రపురంలో పోలీసుల కార్డెన్ సెర్చ్

విశాలాంధ్ర-పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 3వ వార్డు జయరామచంద్రపురం గ్రామంలో బుధవారం ఉదయం కాశీబుగ్గ పోలీసుల ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎటువంటి పత్రాలు లేని మొత్తం నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎన్నికల వేళ ఈ గ్రామంలో చిన్నపాటి ఘర్షణలు చోటుచేసుకోవడంతో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకొంది. వచ్చెనెల 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ జరుగున్న నేపథ్యంలో గ్రామాల్లో అలజడులు లేకుండా ముందస్తుగా పోలీసుల సమస్యాత్మక గ్రామాల్లో జల్లెడ పడుతున్నారు. నాటుసారా. ఒడిసా మద్యం నిల్వలు ఉన్నట్లు సమాచారం రావడంతో అనుమానిత గ్రామాల్లో కార్డెన్సెర్చ్ నిర్వహణకు శ్రీకారం చుట్టారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు సోదాలు నిర్వహిస్తున్న విషయం పాఠకులకు విధితమే. నియోజకవర్గంలో కూడా సమస్యాత్మక ప్రాంతాలు ఉండడం. పోలింగురోజు అనేక ఘర్షణలు జరిగిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎస్ఐ పారినాయుడు ఆధ్వర్యంలో పోలీసులు సోదాలు జరిగాయి.

సాయం చేయుటలోనే సంతృప్తి

స్పందన ఫౌండేషన్ ప్రతినిధులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మండలం బడే కుప్పన్నపేట కేంద్రంగా పనిచేస్తున్న కేపి స్పందన ఫౌండేషన్ సారవకోట మండలం, బురుజువాడ గ్రామానికి చెందిన గొర్లె లక్ష్మీనారాయణ గారి చిన్న కూతురు మోక్ష శ్రీ (2సం) గత నెల రోజులుగా బ్లడ్ క్యాన్సర్ తో బాధ పడుతుందనీ తెలిసి ఆర్థిక సహాయం చేసారు. సహాయము చేయటంలోనే తృప్తి ఉందని సభ్యుల అన్నారు. అనకాపల్లి జిల్లా కేంద్రం లోని అగనంపూడి లోని హెూమీ బాబా కేన్సర్ హాస్పిటల్ లో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. వైద్యము చేపించుకునే క్రమంలో తొమ్మిది నెలలు నిరంతర వైద్య కొనసాగింపు నిమిత్తం చికిత్సా కేంద్రం సమీపం లోనే కుటుంబం మొత్తం వుండాల్సి వచ్చింది. చిన్న చిన్న పనులు చేసి కుటుంబం నెట్టుకొస్తున్న తన పాపకు వైద్యం నిమిత్తం సహాయం కోరగా, స్పందన సైన్యం వెళ్లి ?10000 ఆర్థిక సాయం అందించింది. కార్యక్రమము లో ఫల్గుణ రెడ్డి, చందు పాల్గొన్నారు. ప్రాంతం ఏదైనా సాయం కోరిన వారికి తక్షణ సాయం అందించడం లోనే తమకు సంతృప్తి ఉందని స్పందన అధ్యక్ష,ఉపాధ్యక్షులు షణ్ముఖరావు, భూషణ్ రెడ్డిలు తెలియజేశారు.

కాలుష్యంపై రైతులకు వ్యవసాయశాఖ సిబ్బంది అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : పల్లెల్లో రైతులు పండిన పంటలు నూర్చిన తరువాత వాటిని కాల్చుతున్నారని, వాటిని కాల్చటం వల్ల వచ్చే కాలుష్యంపై వ్యవసాయశాఖ అధికారులు, రైతుభరోసా కేంద్ర సిబ్బంది అవగాహన కల్పించాలని బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చ అద్యక్షులు, మాజీ సైనిక అధికారి మెట్ట మన్మథరావు కోరారు. మండలంలో చాలా గ్రామాల్లో రైతులు వరి, మినప, పెసర, చోడి, జోన్న, శెనగ తదితర పంటలను నూర్చిన తరువాత వాటిని పొలాల్లోనే ఉంచి మంటలు పెట్టి కాల్చుతున్నారని దీంతో పల్లెలు కాలుష్యంతో కొట్టుమిట్టాడుతున్నాయని, ఈ పొగవల్ల చాలామంది వృద్ధులు, చిన్నారులు, రోగులు ఊపిరి ఆడక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు నూర్చిన తరువాత వచ్చిన వాటిని ఒక దగ్గరవేసి వాటిని కుళ్ళబెడితే అవి సేంద్రీయ ఎరువుగా పొలాలకు వాడుకోవచ్చునని వ్యవసాయ అధికారులు, రైతు భరోసా సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. గతంలో పశువులు ఎక్కుగా గ్రామాల్లో పెంచుకొనేవారు కానుక పండిన పంటను నూర్చిన తరువాత వాటిని జాగ్రత్తగా ఉంచి పశువులకు మేతగా పెట్టేవారు. కాని ప్రస్తుతం పశువులు చాల తక్కువగా ఉన్నందున వాటని రైతులు దాచి పెట్టుకోకుండా కాల్చేస్తున్నారని, వారికి అవగాహన కల్పించి కోటబొమ్మాళి మండలాన్ని మరో ఢిల్లిలా మర్చవద్దని ఆయన హితవు పలికారు.

కోతకు గురవుతున్న నాగావళి నది తీరం...

- ప్రకటనలకే పరిమితమైన రక్షణ గోడ...
- అంచనాలకే గ్రోయన్స్ నిర్మాణం...

విశాలాంధ్ర-ఆమదాలవలస : వర్షాలు కురిస్తే చాలు నదుల్లో వర దలు వచ్చి గట్లు ప్రతి ఏటా కోతకు గురవుతూనే ఉన్నాయి. దీంతో నదీ పరివాహక ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. ఆమదాలవలస నియోజకవర్గానికి సంబంధించి నాగావళి, వంశధార నదులు ఉన్నా యి. ఈ నదులకు ఏటా వరదలు వచ్చినప్పుడు పరివాహక ప్రాంతం ముంపునకు గురవుతూనే ఉంది. గడిచిన 20 ఏళ్లుగా పాలకులు నది ఒడ్డు కోతకు గురి కాకుండా రక్షణ గోడ నిర్మాణంతో పాటు గ్రామాల స మీపంలో రాతి గ్రోయన్స్ నిర్మాణం చేపడుతామని పాలకుల హామీ ఇచ్చిన నెర వేరినటువంటి పరిస్థితి నెలకొంది. హుదూద్, నీలం, తిత్లీ, లైలా, పైలాన్ తుఫాన్ నేపథ్యంలో ఈ రెండు నదులకు వరదలు వచ్చి ఒడ్డు కోతకు గురై పరివాహక ప్రాంతం వరద నీటితో ముంపు ప్రాంతంగా మారుతున్నాయి.

- ప్రకటనల పరిమితమైన రక్షణ గోడ... వరదలు వచ్చినప్పుడు పంటలు నష్టపోయి పాలకుల వద్దకు రైతులువచ్చి మొర పెట్టుకున్నప్పుడు కోట్ల రూపాయలతో రక్షణ గోడల నిర్మిస్తామని ప్రకటనలు గుప్పిస్తున్న నేతలు ఆచ రణలో మాత్రం కనిపించడం లేదు. గట్టు కోతకు గురి కాకుండా రక్షణ గోడ నిర్మాణాలకు ఇటీవల కాలంలో 9 కోట్ల రూపాయలు అంచనాలు రూపొందించారు. పనులు మాత్రం జరిగిన పాపాలు పోలేదు. వరదలు వచ్చిన సమయంలో నదీపరివాహక ప్రాంత ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోతుంది. బూర్జ మండలంలో అల్లెన నారాయణపురం లాభం గుత్తావల్లి, ఖండియాం, చిన్న లంకాం గ్రామాలతో పాటు ఆమదాలవలస మండలంలో జీకే వలస, కొరపాం ఎన్టీవాడ, కొత్తవలస, ఇసుకలపేట, చీమల వలస, వెదుల్ల వలస, తొగరాం, కలివరం, కనుగుల వలస, వంజంగి, దూసి, తోటాడ గ్రామాలు నాగావళి నదీ ప్రవాహ తీవ్రతకు గట్లు కోతకు గురవుతున్నాయి. వంశధార నదితో అటు సరుబుజ్జిలి మండలం పరివాహక ప్రాంతాలు ఇటు ఆమదాలవలస మండలంలోని పరివాహక ప్రాంతాలు పంట పొలాలు గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. సరైన రక్షణ గోడలేక వరద నీరు పంట పొలాల పైకి గ్రామాల్లోకి వస్తుంది. వరదలు వచ్చిన సమయంలో రైతులు పంటలు దెబ్బతిని నష్టపోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. రక్షణ గోడ కోసం నిధులు మంజూరు చేస్తామని పాలకులు చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం కనిపించడం లేదు.

కరకట్ల నిర్మాణం జరిగేనా...!

నదీ పరివాహక ప్రాంతాల్లో లోతట్టు గ్రామాల వద్ద కరకట్ల నిర్మాణం పెట్టేం దుకు గత పాలకులు ప్రతిపాదనలు చేసినప్పటికీ ఆ నిధులు నదీ గర్భం లో కలిసిపోయాయి. ఎక్కడికక్కడ స్థాయిని మించి ఇసుక తవ్వకాలతో ఆయా ప్రాంతాలు వరదల సమయం లో ముంపునకు గురవుతున్నాయి. వరదలు వచ్చినప్పుడు రైతులకు మాయ మాటలు చెబుతూ పాలకు లు కాలం వెళ్లబుచ్చుతున్నారే గాని కార్యనిర్వహణ చేపట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికీ కాంగ్రె స్, టిడిపి, వైసీపీ ప్రభుత్వాలు పాలన సాగించినా కరకట్ల నిర్మాణం జరగ లేదు. కొన్ని సందర్భాల్లో నది ప్రవా హం దిశ మార్చినప్పుడు ఇళ్లలోకి సైతం వరద నీరు కొట్టుకు పోయే పరిస్థితి ఏర్పడుతుంది. నీలం తుఫా ను సమయంలో కాలనీ కోతకు గురి కాగా కలివరం వద్ద నాగావళి నది ప్రవాహం దిశ మార్చడంతో రైతు భరో సా కేంద్రం, వెల్నెస్ సెంటర్ కోతకు గురైన నదిలో కొట్టుకుపోయిన విష యం తెలిసిందే. చేతులు కాలేక ఆకు లు పట్టుకున్న సందర్భంగా ప్రభుత్వ భవనాలు నీటిలో కలిసిపోయిన తర్వాత ఆ ప్రాంతంలో గ్రోయిన్స్ నిర్మాణం చేపట్టారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు పాలకులు సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లి వరదలు వచ్చినప్పుడు నదీ పరివాహక ప్రాం తాలు కోతకు గురి కాకుండా రక్షణ చర్యలు చేపట్టి వలసిన అవసరం ఎంతైనా ఉంది. లేదంటే వరదలు వచ్చిన సమయంలో ప్రజలు ఎంతో నష్ట పోవలసిన పరిస్థితి ఉంటుంది.

జీవ వైవిధ్య పరిరక్షణకు కృషి చేయాలి

విశాలాంధ్ర-పలాస: విశాఖపట్నం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 22, 23 తేదీలలో జరుగుతున్న జాతీయ జీవవైవిధ్య సదస్సుకు పలాస మండలంలోని, బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు, నేషనల్ గ్రీన్ కోర్ క్లస్టర్ సమన్వయకర్త శ్రీనివాస్ రావు పాల్గొన్నారు. జాతీయ జీవవైవిధ్య సంస్థ మరియు ఆంధ్రప్రదేశ్ జీవవైవిధ్య మండలి సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సుకు ఎనిమిది రాష్ట్రాలు, జీవవైవిధ్య శాస్త్రీయ సంస్థలు ప్రదర్శించిన స్టాళ్లను సందర్శించడంతో పాటు.. జీవవైవిధ్యం పై శాస్త్రవేత్తల పరిశోధన సెమినార్లకు హాజరయ్యారు. జీవవైవిధ్య సంరక్షణపై తను నేర్చుకున్న విషయాలను విద్యార్థులకు తెలియజేసి..ఆచరణలోనూ కొన్ని కార్యక్రమాలు నిర్వహించి జీవవైవిధ్య పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా సదస్సులో ఆయన మాట్లాడుతూ భూమిపై జీవరాశి మనుగడకు వైవిధ్యం అవసరమని, రోజురోజుకి పెరుగుతున్న వాతావరణ కాలుష్యం వల్ల అనేక జీవ రాసులు తమ మనుగడను కోల్పోతున్నాయని అన్నారు. ఒకప్పుడు ఎక్కడ చూసినా గ్రామాల్లో రాబందులు కన్పించేవని, జంతు కళేబరాలను తిని వివిధ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేవని ప్రస్తుతం ఇప్పుడవి మనుగడలో లేవని, వీటితోపాటు అనేక జంతువులు క్రమంగా ఉనికిని కోల్పోతున్నాయన్నారు. వీటి ఆవశ్యకతను తెలియజేయడానికి మే 22 న అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవంగా, 2010లో అంతర్జాతీయ జీవవైవిధ్య సంవత్సరంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించిందని తెలిపారు.

అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం 2024 యొక్క అధికారిక థీమ్ "ప్రణాళికలో భాగం అవ్వండి" సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంటల్ ఆక్టివిజమ్(సిఇఎ), సొసైటీఫర్ హ్యూమన్ అవేర్నెస్ అండ్ రూరల్ డెవలప్మెంట్ (షార్డ్), అట్లాంటా ఫౌండేషన్ ,మన దేశంలో ప్లానెటరీ సొసైటీఆఫ్ ఇండియా సహకారంతో జీవవైవిధ్యానికి సంబంధించిన కార్యక్రమాలునిర్వహించబడుతున్నాయని, భూమిపై జీవాల మధ్య భేదాన్నే 'జీవవైవిధ్యం' అంటామన్నారు.

మన జీవనశైలితో పర్యావరణం కాలుష్యం చెందడంతో భూగోళం వేడెక్కిపోతుందని, దీంతో జీవవైవిధ్యం దెబ్బతిని ఎన్నో జీవజాతులు అంతరించిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదివరకూ ప్రతి ఇంటిలో పిచ్చుకలు ఉండేవి. పల్లెలలో వాటికోసం ధాన్యపుకంకులు ప్రతీఇంటా వేలాడదీసేవారని రానురానూ అవి కనుమరుగై పోతున్నాయన్నారు.

ప్రపంచంలోని 12 మహా జీవ వైవిధ్య ప్రాంతాలలో మనదేశం ఒకటని, సుమారు 45 వేల వృక్ష జాతులు, దాదాపు 77 వేల జంతు జాతులు మనదేశంలో ఉండేవని కానీ ఇదంతా గతమన్నారు. నేడు ఆ విస్తారమైన జీవ సంపదలో 10 శాతానికి పైగా ప్రమాదంలో ఉందని వాటిలో చాలా జాతులు అంతరించిపోయే దశలో ఉన్నాయన్నారు. గత కొన్ని దశాబ్దాలలో 50 శాతానికిపైగా అరణ్యాలు, 70 శాతానికి పైగా నీటి వనరులు విలుప్తమైపోయాయని, విస్తారంగా ఉన్న పచ్చిక బయళ్ళను మన జీవనశైలితో రూపుమాపేశామన్నారు. సముద్రతీరాలను అతలాకుతలం చేసేశామని, ఇవన్నీ చాలవన్నట్టు అరణ్యాలలోని వన్యప్రాణుల్ని వేటాడి కొందరు అంతమొందిస్తున్నారని అన్నారు.

వ్యవసాయంలో రసాయనిక ఎరువులకు, కీటక నాశనులకు ప్రాధాన్యత పెరిగిందని, మందుల కంపెనీల లాభాపేక్ష వాటిని అధికంగా, విచక్షణారహితంగా వాడేలా చేసిందన్నారు. దీంతో మన నేలను, దానిపై నివసించే విలువైన జీవసంపదను కోల్పోవాల్సి వచ్చిందన్నారు. అంతే కాకుండా అత్యధిక కీటక నాశనులను ఉత్పత్తి చేసే దేశంగా విరాజిల్లుతోందని, ఇటువంటి అవాంఛనీయ చర్యల వల్ల దారుణంగా నష్టపోవడమే కాకుండా అపార జీవజాతులు

అంతరించిపోయాయన్నారు.

మన దేశంలో ఆదివాసులు ఎక్కడున్నారో అక్కడ జీవవైవిధ్యం ఎక్కువగాను, పదిలంగాను ఉందని, దేశంలో 53 మిలియన్ల కంటే ఎక్కువమందే ఆదివాసులు నివసిస్తున్నారని వారిలో దాదాపు 53 తెగలున్నాయని తెలిపారు. మేఘాలయ, నాగాలాండ్, మిజోరాం, అరుణాచల్ప్రదేశ్లో 80 శాతానికంటే ఎక్కువమంది గిరిజనులు ఉన్నారని, అక్కడే జన్యు వైవిధ్యం కూడా ఎక్కువగా ఉండి ఎన్నో పంటలలో వైవిధ్యాలు, రకాలు, ఆదివాసులు నివాసాలున్న ప్రాంతాలలోనే అధికమన్నారు.

ఇటీవల జన్యుమార్పిడి కూడా జీవవైవిధ్యాన్ని దెబ్బతీస్తోందని, వీటిని రూపొందించే, ప్రవేశపెట్టే విషయాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, రక్షణ సంబంధమైన నియంత్రణలను పాటించాలన్నారు. జన్యుమార్పిడి వల్ల వచ్చే ప్రభావాలు స్వల్పకాలంలో, దీర్ఘకాలంలో ఎలా ఉంటాయో పూర్తి అధ్య యనం చేయకుండా వీటిని ఏ జీవజాతుల్లోనూ ప్రవేశ పెట్టకూడదన్నారు. తొందరపడితే ప్రస్తుతం మనుగడలోని జీవజాతికే ప్రమాదం వాటిల్లుతుందనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు.ఇటీవల సౌదీ అరేబియా వంటి దేశాలు పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని,జీవ వైవిధ్యం ఉండాలంటే కనీసం భూమిపై 33శాతం అడవులు ఉండాలని ఆ దిశగా ప్రపంచ దేశాలు ఉమ్మడిగా కృషి చేయాలి అని తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 22 మంది విద్యార్థులు పాల్గొన్నారని గ్రంథాలయ అధికారి కె.రామకృష్ణ తెలిపారు. విద్యార్థులు ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి వేసవి విజ్ఞాన శిబిరం సందర్భంగా జరుగుతున్న పోటీల్లో పాల్గొనాలని ఆయన కోరారు. అలాగే నౌవడ శాఖా గ్రంథాలయంలో గ్రంధాలయాధికారిని బి రూపవతి అధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిభిరం నిర్వహించారు.

నేడు బోరుభద్రలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి... సంతబొమ్మాళి మండలం బోరుభద్ర గ్రామంలోని ఎంపీ యూపీ స్కూల్ ఆవరణలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీటీసీ ప్రతినిధి చింతాడ చిన్నారావు తెలిపారు. నరసన్నపేటకు చెందిన ఫిజియోథెరపిస్ట్, సైకాలజిస్ట్ డాక్టర్ లఖినేని సంధ్యారాణి ఆధ్వర్యంలో, నరాలు, కండరాలు, ఎముకలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలకు సంబంధించి వైద్య శిబిరం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బ్రహ్మోత్సవాల్లో నగరానికి చెందిన నాట్య కళాకారిణులు

విశాలాంధ్ర-శీకాకుళం టౌన్: స్థానికం సాంస్కృతికం, తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ గోవిందరాజస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నగరానికి చెందిన కె పరిమళ హరిహర్ నాట్య కళాకారిణి వారి శిష్యులు జ్ఞాన ప్రసన్న, యాసస్విని, దీక్షణ సాయి, జయ హర్షహరిహర రావు, బ్రహ్మోత్సవాల్లో కల్పవృక్ష వాహన సేవలో తిరుమాడ వీధిలో భరతనాట్య ప్రదర్శన చేస్తూ స్వామి వారి సేవ చేసి అందరి ప్రశంసలు పొందారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారు నిర్వహించే ప్రతి కార్యక్రమంలో వీరు పాల్గొని ఆ స్వామివారికి నృత్య నీరాజనం సమర్పించు కుంటున్నారని తెలియజేశారు.

అల్లర్లు జరగకుండా చర్యలు తీసుకోవాలి : ఆర్డీవో భరత్ నాయిక్

విశాలాంధ్ర-పలాస : సార్వత్రిక ఎన్నికలు ముగిసి వచ్చే నెల 4వ తేదీన కౌంటింగ్ ప్రారంభం కానున్న దృశ్య సమస్యాత్మక ప్రాంతాల్లో ఎటువంటి అల్లర్లు, ఘర్షణలు, వివాదాలు, దాడులు వంటి సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి చర్యలు చేపట్టాలని పలాస ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి భరత్నాయిక్ పోలీసులకు సూచించారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో కొన్ని ప్రాంతాల్లో వివాదాలు, అల్లర్లు వంటి సంఘటనలు జరిగాయని అన్నారు. ఎన్నికలకు సంబంధించి జూన్ 4వ తేదీని ఓట్లు లెక్కింపు ప్రారంభం కానున్న దృశ్య ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ప్రధాన పార్టీల అనుచరులు మధ్య గెలుపు ఒటమిలపై మాటల యుద్దాలు జరుగుతున్నట్లు తెలుస్తోందన్నారు. ఫలితాలు వెలువడిన వరకు అనంతరం కొద్దిరోజుల పాటు సమస్యాత్మక ప్రాంతాలపై గట్టి నిఘా ఎర్పాటు చేయాలన్నారు. అంతేకాకుండా ఇంత వరకు ఎన్నికల్లో ఎంత మందిపై కేసులు నమోదు చేశారు... ఎంతమందికి అరెస్టులు చేసి కోర్టుకు తరలించారు.. అనే నివేదిక అందించాలన్నారు. అంతేకాకుండా ఎన్నికల నేపథ్యంలో ఎంతమందికి బైండోవర్ చేశారు.. వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. అంతే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి ఎవరైనా కొత్త వ్యక్తులు నియోజకవర్గానికి చేరారా.. అటువంటి వారి గమనికలు కూడా క్షున్నంగా పరిశీలించి అనుమానం వస్తే వారిపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గానికి సంబంధించి ఇప్పటి నుంచి కౌంటింగ్ సమయానికి అనంతరం కూడా ఎటువంటి హింసాత్మక సంఘటనలు ఘర్షణలు లేకుండా ఎన్నికల సాఫీగా జరిపేందుకు పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగిన మూల్యం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో డిఎస్పి నాగేశ్వరరెడ్డి, కాశీబుగ్గ సి.ఐ కె.విజయనంద్, ఎస్.ఐలు పారినాయుడు, వెంకటరావు, రూరల్ సి.ఐ, వజ్రపుకొత్తూరు ఎస్.ఐలు పాల్గొన్నారు.

నాణ్యతకు తిలోదకాలు

కంచిలి సీసీ రోడ్డు నిర్మాణంలో అవినీతి

విశాలాంధ్ర-సోంపేట/కంచిలి : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన వివిధ పథకాలు ద్వారా మంజూరైన భారీ నిధులను పాలకులు, అధికారులు సిమెంట్ రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్న విషయం తెల్సిందే. అటువంటి నిర్మాణాలు కొన్ని చోట్ల నాణ్యతతో చేపట్టగా మరికొన్ని చోట్ల సంబంధిత ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల స్వార్థంతో నాణ్యతకు పూర్తిగా తిలోదకాలిచ్చి నెలలు తిరగకుండానే ఆయా రహదారులు నామ రూపాలు లేకుండా శిధిలావస్థకు చేరిన పరిస్థితులు కూడా పలు చోట్ల ఉన్నాయి. అటువంటి పరిస్థితుల్లోనే కంచిలి మండల కేంద్రంలో రెవెన్యూ కార్యాలయం నుంచి జాతీయ రహదారి వరకు సుమారు 12లక్షల రూపాయల వ్యయంతో సుమారు ఏడాది క్రితం నిర్మించిన సీసీ రోడ్డు పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందంటే అతిశయోక్తి కాదు. లక్షలాది రూపాయల నిధులు ఖర్చు చేసి నాణ్యతకు ఏమాత్రం ప్రాధాన్యం ఇవ్వకుండా తూతూ మంత్రంగా పనులు చేపట్టి ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు తమ జేబులు నింపుకున్న పరిస్థితి ఈ రహదారి నిర్మాణం చూస్తే స్పష్టంగా అర్థమవుతుంది. రోడ్డు నిర్మాణం చేపట్టి నెలలు గడవక ముందే కాంక్రీట్ పూర్తిగా తేలిపోయి భారీ గోతులు ఏర్పడి అత్యంత దరిద్రంగా తయారైన ఈ సీసీ రోడ్డు నిర్మాణం పట్ల విమర్శలు తీవ్ర స్థాయిలో వినిపిస్తున్నాయి. పది కాలాల పాటు ఎంతో ధృడంగా, నాణ్యతగా ఉండాల్సిన రహదారి కాంట్రాక్టర్ల స్వార్దానికి నిలువెత్తు నిదర్శనంగా మారింది. ఇటువంటి కాంట్రాక్టర్లపై కనీస చర్యలు కూడా చేపట్టకుండా సంబంధిత పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు బిల్లులు కూడా సక్రమంగా చెల్లించినట్లు సమాచారం. దీనిపై కంచిలి ఇంజనీరింగ్ అధికారి హిమసాగర్ వద్ద విశాలాంధ్ర ప్రస్తావించగా ఇక్కడ బాధ్యతలు చేపట్టి కొద్ది కాలంఅయ్యిందని ఈ రహదారి నిర్మాణం అంతకు ముందు జరిగిందని పూర్తి వివరాలు తన వద్ద లేవని పేర్కొనడం గమనార్హం.

మే 24 నుండి పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

జిల్లా విద్యా శాఖధికారి వేంకటేశ్వరరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుండి జూన్ 3వ తేదీ వరకు ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12.45 వరకు జరగనున్నాయని జిల్లా విద్యా శాఖధికారి వేంకటేశ్వర రావు, పరీక్షల నిర్వహణధికారి అలీ ఖాన్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా లో 9 పరీక్షా కేంద్రాలలో సుమారు 2100 మంది పరీక్షలు రాయనున్నారని పరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందదన్నారు. ఓపెన్ స్కూల్ ఎస్ఎస్సీ మరియు ఇంటర్ పరీక్షలు 7 పరీక్ష కేంద్రాలలో (2ఎస్ఎస్సీ అండ్ 5 ఇంటర్) తేదీ జూన్ 1 నుండి జూన్ 8 వరకు మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 5.30 వరకు జరగనున్నాయన్నారు. పరీక్షకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చెయ్యడం జరిగిందన్నారు. డీఈఈ సెట్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ఉదయం 10 గంటలనుండి 12.30 వరకు రాష్ట్రవ్యాప్తంగా జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్)లలో ప్రవేశానికై పరీక్ష జిల్లాలో రెండు కేంద్రాలలో వేంకటేశ్వర ఇంజనీరింగ్ కాలేజీ, ఎచ్చెర్ల 90 మంది, కోర్ టెక్నాలజీస్, నరసన్నపేట 270 మంది రాయానున్నరని తెలియజేశారు.

సర్వసభ్య సమావేశంలో సీటు కోసం వివాదం

విశాలాంధ్ర-కొత్తూరు.. కొత్తూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ సవర సావిత్రి అధ్యక్షతన జరిగుంది అయితే ప్రత్యేక ఆహ్వానితులు అంపిలి ప్రశాంత్ వేదికపైకి పి.ఏ.సిఎస్ అధ్యక్షులు చింతడా సూర్యనారాయణను పిలువడంతో ఒక్క సరిగా వివాదం చోటుచేసుకుంది సభ్యులు కానివారిని ఎలా వేదికపైకి పిలుస్తారని కొందరు ఎంపీటీసీలు ఎంపీపీని, ప్రత్యేక ఆహ్వానితులు ప్రశాంత్ను నిలదీశారు. దీంతో సభ్యులు మధ్య వివాదం సాగింది. ఒక దశలో తోపులాట వరకు పరిస్థితి దారితీసింది ఇంతలో సమాచారం వెళ్లడంతో ఎస్ఐ అహమ్మద్ పోలీస్లతో ఎంపిడిఓ కార్యాలయ సమావేశ స్తాలానికి చేరుకొని పరిస్థితి సద్దుమణిగింది. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసి వరప్రసాద్ రావు ఎంపీటీసీలు సర్పంచ్లు ఎంపిడిఓ త్రివిక్రమ్రావు, తదితరులు పాల్గొన్నారు.

పలాసలో పొలిటికల్ టెన్షన్

విశాలాంధ్ర-పలాస/మందస: పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు మే 13వ తేదీ ముగిసిన నుంచి పలాస నియోజకవర్గంలో అధికార టీడీపీ, వైకాపా పోలింగ్ సరళిపై పోలింగ్ బూత్లు వారీగా అంచనాలు వేస్తూ మల్లగుల్లాలు పడుతున్నాయి. ఏపి పోలింగ్ స్టేషన్ పరిధిలో తమకు అనుకూలంగా ఓట్లు పడ్డాయో... మెజార్టీ ఎంత మేరకు వస్తుందోనని లెక్కలు కడుతున్నారు. టీడీపీ, వైకాపా, కాంగ్రెస్, సిపిఐ ఎం.ఎల్ లిబరేషన్ తరుపున అభ్యర్థులతో పాటు ఇండిపెండెంట్ అభ్యర్థి పోటీ చేశారు. పోటీల్లో 10 మంది అభ్యర్థులు ఉన్నప్పటికీ టీడీపీ అభ్యర్థి గౌతు శిరీషా, వైకాపా అభ్యర్థి డాక్టర్ సీదిరి అప్పలరాజుల మధ్య ప్రధానంగా పోటీ ఏర్పడింది. ఈ మూడు పార్టీల్లోని శిబిరాల్లో నేతలు, పార్టీ శ్రేణులు మెజార్టీ అంచనాల్లో తలమునకలై ఉన్నారు. ఎన్నికలు జరిగిన ముందు రోజున చోటు చేసుకున్న లోపాలపై దృష్టి సారించారు. బూత్ ఖర్చులకు ఇచ్చిన డబ్బులు కాజేసిన వ్యవహారంపై ఎక్కువగా వైసీపీ దృష్టి పెట్టింది. టీడీపీలో కూడా ఇటువంటి తప్పులు అక్కడక్కడ జరిగినట్టు ప్రచారం జరుగుతుంది. రెండు పార్టీల అభ్యర్థులకు బూత్ల స్థాయిలో పార్టీ శ్రేణులు ఫిర్యాదులు చేస్తున్నాయి. టీడీపీ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు గతంలో రాష్ట్రాభివృద్ధి కోసం చేస్తున్న కృషి తమకు ఓటర్లు పట్టం కడుతున్నారని టీడీపీ పార్టీ అంచనా వేస్తుంది. వైసీపీ పాలనలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలకు ప్రజల నుంచి మంచి స్పందన బాగుంది. ఈ నేపథ్యంలో వైకాపాకు పట్టం కట్టనున్నారని వైకాపా అంచనా వేస్తుంది. మరో పక్క మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన వైకాపా అభ్యర్థి డాక్టరు సీదిరి అప్పలరాజు కావడంతో ఉద్దానం, సముద్ర తీర ప్రాంతంలో మత్స్యకార సామాజిక వర్గంలో మెజార్టీ వర్గీయులు వైకాపా వైపు మొగ్గు చూసినట్టు ఆ పార్టీ అంచనా వేస్తుంది. ఇక పార్టీపరంగా చూస్తే మందస, పలాస మండలాల్లో వైకాపాకు మెజార్టీ స్పష్టంగా ఉన్నట్టు, పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ వజ్రపుకొత్తూరు మండలంలో టీడీపీ, వైకాపా సమాన స్థాయిలో ఉన్నట్టు పరిశీలకులు భావిస్తున్నారు. టీడీపీ కూడా ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తామని ఘంటా పదంగా చెబుతున్నారు. ఎన్నికల ముందు పోల్ మేనేజ్మెంట్ చక్కగా చేశామని, ఈసారి 10వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధిస్తామని ఆ పార్టీ నాయకులు దీమా వ్యక్తం చేస్తున్నారు. వచ్చే నెల 4వ తేదీన ఓట్లు లెక్కింపు ఉండడంతో ఇంకా 12 రోజులు పార్టీ శ్రేణులు ఓపిక పట్టాలి, దీంతో ప్రధాన పార్టీల్లో పొలిటికల్ టెన్షన్ నెలకొంది.

వివాహిత ఆత్మహత్య

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : మండలంలో డొంకూరు గ్రామంలో వివాహిత మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గ్రామంలో విషాదాన్ని నింపి, సంచలనం కల్గించింది. గ్రామీణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు డొంకూరుకు చెందిన వాసుపల్లి రామారావు భార్య ఉష(30)గత కొంత కాలంలో వివరీతమైన తలనొప్పితో బాధపడుతు చికిత్స పొందుతుంది. వారికి ఇద్దరు బాలికల సంతానం నందన(10), రిత్విక (5). బుధవారం మృతురాలు తీవ్రమైన తలనొప్పి తాళలేక ఇంట్లో ఉరిపోసుకుని మరణించినట్లు అందిన సమాచారంతో సంఘటనా స్థలాన్ని ఎస్సై లక్ష్మణ్ సిబ్బందితో సందర్శించి కేసు నమోదు చేసి ధర్యాప్తు ప్రారంభించారు. తల్లి మరణంతో చిన్నారుల రోధన అక్కడి వారి హృదయాలను కలచివేసింది.

ఘనంగా లక్ష్మీ నరసింహ స్వామి జయంతి

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని బల్లిపుట్టుగ, బొరివంక, మాణిక్య పురం తదితర గ్రామాల్లో లక్ష్మి నరసింహ స్వామి జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేపట్టి పూజలు చేశారు. వేకువజాము నుండి స్వామి వారికి సుప్రభాత సేవ,తులసీ అర్చన,మహా నైవేద్యం, హెూమాది కార్యక్రమాలు చేపట్టారు. బొరివంక చెల్లెమ్మ గారి వీధి లో గల లక్ష్మీనరసింహస్వామి వారి పూజా కార్యక్రమాలను గార వరాహ లక్ష్మీనరసింహస్వామి (రాజుస్వామి) కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో విశేష పూజలు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. బల్లి పుట్టుగ, బొరి వంక గ్రామంలలో శ్రీ రామ లింగేశ్వర ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని ప్రత్యేక పూజలు చేపట్టారు. బొరివంకలో ఉద్దానం కళాకారులచే 24 గంటల పాటు అఖండ నామ సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

ఓటరు ఎటు వైపో..?

- సంక్షేమమా... అభివృద్ధా...?

- మారుతున్న ప్రజావాణి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: అగట్టునుంటావా... ఈ గట్టుకొస్తావా... అంటూ పలువిధాలా ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు చేసిన రాజకీయపార్టీలు పోలింగ్‌లో ఓటర్లు ఎటువైపున ఉన్నారో అంతుచిక్కక అల్లాడుతున్నట్లు కనిపిస్తోంది. సర్వేల్లో గంటకో రీతిన ఫలితాలు వెల్లడికావడం... సోషల్ మీడియా తమ అభిష్టాన్ని బట్టి అభ్యర్థుల జీవితాలతో ఆటలాడుకున్నట్లు ఫలితాలు ప్రకటించటం గందరగోళంగా మారింది. వైసీపీ అరాచకం, అభివృద్ధి లేక పోవడం మూలంగా ప్రజలు తిరుగుబాటు చేసి ఎక్కువ మంది కూటమికి మద్దతుగా నిలిచారని.. కూటమిదే అధికారం అని ఇటీవల వరకు ప్రచారం జరిగింది. కానీ తాజాగా జనం స్వరం మారింది. సంక్షేమం రాజ్యం మళ్ళీ రావాలి జగన్మోహన్ రెడ్డిని మళ్ళీ గెలిపించాలని సైలెంట్ ఓటు వేశారని జనం తిరగబడ్డారని గెలుపు ఫ్యాన్ దని ప్రచారం పంకా వైపు మళ్లింది.

పోలింగ్.. లెక్కింపు మధ్య గ్యాప్ తో గందరగోళం..:

పోలింగ్‌కు కౌంటింగ్‌కు మధ్య ఎప్పుడూ లేనంత గ్యాప్ ఈ పరిస్థితికి కారణంగా చెబుతున్నారు. నీతి నిజాయితీ వంటివి పడి కట్టు పదాలుగా భావిస్తూ కొందరు ఓటర్ మహాశయులు అందినకాడికి నజరానాలు పుచ్చుకున్నారు. కానీ తమ ఓటువారు ఎవరికి వేశారో నిజాయితీగా చెప్పలేదు. ఓటు మన గుర్తుకే వేశారా? అంటూ ఆరాలు తీస్తున్నారు. మొదట్లో అంటే పోలింగ్ ముగిసిన వెంటనే ఓటర్ల నాడిని తెలుసుకునే ప్రయత్నంలో కొన్ని మీడియా ఛానళ్లు, సోషల్ మీడియా వివిధ రాజకీయ పక్షాలు, ఇతరత్రా సర్వేలద్వారా తమకు దొరికిన సమాచారాన్ని బయట పెట్టారు. వార్తలు విశ్లేషణల పేరుతో ఫలితాలను వండి వార్చారు. పోలింగ్ సరళిని బట్టి కూడా కొందరు ఫలితాలు అంచనా వేసి అప్రకారమే విజేతలను నిర్ణయం చేశారు. కానీ తాజా సమాచారం ప్రకారం అప్పటి విశ్లేషణలో అంతా వాస్తవం కాదని చెబుతున్నారు. అందులో కొన్నిపొరపాట్లు అత్యుత్సాహం కొద్దీ వెల్లడించిన సమాచారం కూడా ఉందని నాలుక కర్చు కుంటూ తూచ్.. అని సర్దుకుని తప్పుల దిద్దుబాటుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

విజయం కూటమిదే.. కాదు కాదు వైసీపీదే...

ఈ ఎన్నికల్లో విజయమో వీరస్వర్గమో అన్నట్లు ప్రధాన పక్షాలు వైసీపీ, తెలుగుదేశం కూటమి పని చేశాయి. అధికార వైసీపీ మొదటి నుంచి వైనాట్ 175 అంటూ ఊదరగోట్టి నట్టు ప్రచార సరళి సాగింది. తెలుగుదేశం పార్టీ, జనసేన,బీజేపీ జట్టుగా అభ్యర్థులను బరిలో దించి కూటమిదే విజయం అని ధీమాతో ప్రచారం హెూరెత్తించారు. కాంగ్రెస్ పార్టీ కూడా పోటీలో 'ఉన్నా నామ మాత్రపు ప్రచారం పోటీ తో సరిపెట్టుకున్నట్లు భావించాలి. టీడీపీ కూటమి, వైసిపి పోటీ పడి ధన ప్రవాహం సాగించినట్లు వార్తలొచ్చాయి. ఓటుకు మినిమం వెయ్యి.. అన్ని అసెంబ్లీ స్థానాల్లో ఇరు పార్టీల నుంచి ఓటర్లకు చేరినట్టు నమ్మదగ్గ సమాచారం. దాదాపు 2 మాసాల పాటు ఎన్నికల ప్రచారం తదుపరి ఓటుకు నోటు పంపిణీ మూలంగా ఓటర్లు బాధ్యత గుర్తెరిగి పోలింగ్‌లో పాల్గొన్నారు. మరి ఇరు పార్టీల వద్ద నజరానాలు అందుకున్న మహాశయులు ఎవరికి ఓటెత్తారో తెలీదు.. చెప్పరు. మర్చిపోతారు.. పోలింగ్ దరిమిలా దాదాపు అన్ని సర్వేలు కూటమిదే అధికారం అని 110 నుంచి 145 వరకు సీట్లు గెలుస్తారని పోల్ సర్వేలని విశ్లేషణలు ఇచ్చారు. అధికార పార్టీకి ఈ ఎన్నికల్లో కొమ్ము గాచిన రెండు మూడు పెద్ద చానళ్లు ఓ రెండు మూడు యూ ట్యూబ్, డిజిటల్ ఛానళ్లు మినహా దాదాపు అన్ని మీడియాలు కూటమి దే అధికారమని కోడై కుసాయి. జనం వరుస కూడా అలాగే కనిపించింది. కానీ రెండు మూడు రోజులుగా వరుస మారినట్టుగా అనిపిస్తుంది. సోషల్ మీడియాలో ఇతరత్రా అధికార వైసీపీ వైపు గాలి మళ్లింది. ఆ పార్టీ నాయకుల స్వరంలోను తేడా వచ్చింది. ఫలితాల వెల్లడికి ఓట్ల లెక్కింపు తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో ఈ మార్పు దేనికి సంకేతం? గెలుపు ఎవరిది? కూటమి అధికారంలోకి వస్తుందా? వైసీపీ పవర్ నిలబెట్టు కుంటుందా? వేచి చూడాలి.

శాంతిబద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రతీ ఒక్కరు వ్యవహరించాలని రూరల్ ఎస్సై లక్ష్మణ్ అన్నారు. బుధవారం మండలంతో అత్యంత సమస్యాత్మక ప్రాంతమైన బాలక్రిష్ణాపురంలో కవిటి ఎస్సై రాము, ఇతర సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేకుండా ఉన్న పలు మోటరు సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో రెచ్చగొట్టే చర్యలకు ఉపక్రమించి శాంతి బద్రతలకు ఏ మాత్రం విఘాతం కల్గించిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఒడిశా రాష్ట్రానికి సరిహద్దుల్లో ఉండటంతో అక్రమ సారా ప్రభావం, సంఘ వ్యతిరేక శక్తులు చెలరేగి, ఒడిశాలో తలదాచుకునే అవకాశాలు ఎక్కువగా ఉందని, ఓట్ల లెక్కింపు ఎన్నికల ఫలితాల ప్రక్రియ దగ్గర పడుతుండటంతో శాంతి బద్రతల దృష్ట్యా ప్రత్యేక దృష్టితో వ్యవహరిస్తు చర్యలు తీసుకుంటున్నామని, ఎవ్వరైనా కవ్వింపు చర్యలకు పాల్పడితే తక్షణం తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

జోన్ చైర్మన్‌గా లయన్ పొన్నాడ రవికుమార్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: 2024-2025 సంవత్సరంనకుగాను 316-ఏ గవర్నర్ ఎన్.వి.బి.ఎస్.ఎస్.ప్రసాద్ నేతృత్వంలో ఇంటర్నేషనల్ జోన్ చైర్మన్‌గా లయన్ పొన్నాడ రవి కుమార్‌కు స్థానం లభించింది. ఈ సందర్భంగా రవికుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. మీ అందరి సహకారంతోనే ఇది సాధ్యమైందని, మీ సహకారం మరువలేనిదని, 2019 లో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సభ్యునిగా ప్రస్థానం ప్రారంభించిన తర్వాత క్లబ్ ట్రెజరర్‌గా, సెక్రటరీగా, క్లబ్ వైస్ ప్రెసిడెంట్‌గా సేవలు అందించానని తర్వాత 2023/2024 కాలానికి క్లబ్ ప్రెసిడెంట్ గా జిల్లాలో అనేక సేవా కార్యక్రమంలతోపాటు, ప్రజలుకు అందుబాటులో ఉండే అవకాశం వచ్చిందన్నారు. నా సేవా కార్యక్రమంలు గుర్తించిన క్లబ్ మెంటార్ నటుకుల మోహన్ గవర్నర్‌కు సిపార్సు చేసి జోన్ చైర్మన్‌గా చేసినందులకు అతనికి ధన్యవాదములు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బి. దేవబుషణం, డాక్టర్ బి. సురేష్, డాక్టర్ పైడి సింధూర, సభ్యులు ఉర్లం. శివతేజ అభినందనలు తెలిపి మాట్లాడుతూ రవి కుమార్ అధ్యక్షతన ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించారని, నిరంతరం సేవ చెయ్యాలనే తపన పడుతూ సమాజానికి, ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలతో పాటు, జిల్లా లోని ప్రముఖ కాలేజీలలో అవగాహనా కార్యక్రమాలతో విద్యార్థులకు చైతన్యం కలిగించారన్నారు. గడిచిన ఎన్నికలలో ప్రజలలో ఓటుపై అవగా హన కలిగిస్తూ ఆయన చేసిన కృషి చొరవతో జిల్లాలో వోటింగ్ శాతం పెరగటం విశేషం. ఇందులో భాగంగా శ్రీకాకుళం జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పీ,జిల్లా జాయింట్ కలెక్టర్, అధికారులతోపాటు జిల్లా నలుమూలలు నుండి ప్రశంస లు అందుకున్నారు. లైన్ రవి కుమార్ ఇంటర్నేషనల్ జోన్ చైర్మన్‌గా ఎన్నిక అవ్వడం పట్ల పలు స్వచ్ఛంద సంస్థలు అభినందనలు తెలియజేశాయి.

దుర్గంధంతో కంచిలికి స్వాగతం...!

ప్రధాన రహదారి పక్కనే చెత్త కుప్పలు

కంచిలి శివారున రోడ్డు పక్కన వ్యర్థాలతో నిండిన దృశ్యం

విశాలాంధ్ర-సోంపేట/కంచిలి : గ్రామం గాని పట్టణం గాని తన సామర్థ్యాన్ని గొప్పతనాన్ని ప్రజలకు తెలియజెప్పేందుకు వాటి పరిసరాలను బట్టి అంచనా వేస్తారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుతూ పచ్చని మొక్కలతో, చెట్లతో కళకళలాడుతూ రహదారులు, తాగునీటి సదుపాయాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేసినప్పుడు ఆ గ్రామానికి లేదా ఆ పట్టణానికి ప్రజలు ఎంతగానో ఆకర్షితులవుతారు. సోంపేటకు అతి సమీపంలో అటు ఇచ్ఛాపురం, పలాస మధ్య పెద్ద రైల్వేస్టేషన్ కలిగిన కంచిలి మండల కేంద్రానికి సోంపేట వైపునుంచి నిత్యం వెళ్లే ప్రజలు ముక్కులు బిగపెడుతూ ఎంతో ఇబ్బందికరంగా కంచిలి మేజర్ పంచాయతీలోకి ప్రవేశిస్తారు. సోంపేట నుంచి కంచిలి వెళ్లే రహదారిలో ఫ్లైఓవర్ దాటగానే శ్మశానవాటిక పరిసరాల్లో పంచాయతీకి సంబంధించిన చెత్తా చెదారాలు ప్రధాన రహదారికి పక్కనే కుప్పలు తెప్పలుగా పారబోస్తున్నారు. రోడ్లపై ఊడ్చిన చెత్తా చెదరాలు, మృతి చెందిన మూగజీవాలు, వ్యాపారులు విక్రయించిన బ్రోయిలర్ కోళ్ల వ్యర్థాలు మొదలైన చెత్త పదార్థాలన్నీ రోడ్డు పక్కనే పడేయడంతో అవి కుళ్లి నిరంతరం కంపు కొడుతూ ఆ పరిసరాలన్నీ ఎంతో దుర్గంధంగా మారుతున్నాయి. ఈ పరిస్థితి సోంపేట నుంచి కంచిలికి, కంచిలి నుంచి సోంపేటకు ప్రతిరోజు రాకపోకలు సాగించే వందలాది మందికి తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి కొనసాగుతున్నప్పటికి అటువైపుగా వచ్చిపోయే ప్రజలు సంబంధిత అధికారులు, పాలకుల తీరుపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నా మాకేమి పోయింది నామాల కాకి అనే తీరున వ్యవహరిస్తున్నారు తప్పా సమస్యను పరిష్కరించేందుకు సరైన చిత్తశుద్ధి కనబర్చకపోవడం అటు కంచిలి, సోంపేట ప్రజల దురదృష్టంగా చెప్పవచ్చు. ఇటువంటి ప్రధాన సమస్యపై దృష్టి సారించాల్సిన కంచిలి మేజర్ పంచాయతీ అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోంది. పరిసరాల పరిశుభ్రతపై ప్రధానంగా దృష్టి సారించాల్సిన పంచాయతీ అధికారులు, పాలకులు కనీసం తొంగి చూడకపోవడం వారి పాలన తీరుకు అద్దం పడుతుందని పలువురు పేర్కొంటున్నారు. ప్రజల నివాసాలు కూడా అతి దగ్గరలోనే ఉండడం వీటికి తోడు రోడ్డు పక్కనే బహిరంగ మలవిసర్జన చేయడం మొదలైన చెత్త వ్యవహారాలకు ఈ ప్రాంతం ఆవాసంగా మారడమే కాకుండా ప్రజల ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని పలువురు పేర్కొంటున్నారు. ఈ సమస్యపై ఇప్పటికైనా కంచిలి గ్రామ పంచాయతీ దృష్టి సారించి రోడ్డు ప్రక్కన వ్యర్థాలను తొలగించి ప్రజారోగ్యానికి పెద్దపీట వేయాలని ఇటు కంచిలి, అటు సోంపేట ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ఊడికలపాడులో 108 పశువులకు జబ్బవాపు వ్యాధి నివారణ టీకాలు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: మండలంలో గల ఊడికలపాడు గ్రామంలో 108 పశువులకు బుధవారం జబ్బవాపు నివారణ టీకాలు వేయటం జరిగిందని కురుడు పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో ఈ టీకాలు షెడ్యూల్ ప్రకారం వేయడం జరుగుతున్నది కావున రైతులందరూ పశు వైద్య సిబ్బందికి సహకరించి తమ యొక్క పశువులకు టీకాలు వేసుకునే బాధ్యతను తీసుకొని సరైన కాలంలో సక్రమంగా వేయించుకోవాలని వ్యాధులు రాకుండా నివారించుకు కోవాలని ఆయన పాడిరైతులకు కోరారు. ఈ వ్యాధి బారిన పడిన పశువులు ఎక్కువగా మరణిస్తున్నాయని, ఎక్కువగా మూడు మాసాల నుంచి ఏడు మాసాలు దూడలు ఈ వ్యాధి బారిన పడుతుంటాయని, ఈ వ్యాధి సోకిన పశువులు మేత ఆపడం, లేవలేకపోవడం ఎక్కువగా వెనుక కాళ్ల కండరాలలో గాలి చేరి, కణజాలము కుళ్లుతుందని, దీనివలన అధికంగా 104-105 డిగ్రీల జ్వరం వచ్చి చనిపోతాయన్నారు.

హర్షవల్లి లయన్స్ క్లబ్‌కు అరుదైన గౌరవం

- లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా చైర్మన్ గా కెఎన్ఎస్.వి ప్రసాద్, జోనల్ చైర్మన్ గా శోభారాణి నియామకం

- 2024-25 సంవత్సరానికి నూతన కార్యవర్గ ఏకగ్రీవ ఎన్నిక

- క్లబ్ అధ్యక్షునిగా లయన్ జగన్నాధనాయుడు

కెవీవీ ప్రసాద్, శోభారాణి

విశాలాంధ్ర-అరసవల్లి: హర్షవల్లి లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం చేస్తున్న సేవలకుగానూ, వారిని ప్రశంసిస్తూ 316ఎ లయన్స్ ఇంటర్నేషనల్ ఏక కాలంలో రెండు పదవులను ప్రకటించి అరుదైన అరుదైన గౌరవాన్ని అందించింది. నగరంలోని హర్షవల్లి లయన్స్ క్లబ్ కార్యాలయంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ పదవులను అందిస్తూ తీర్మా నించారు. లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా చైర్మన్ గా కెఎన్ఎస్.వి ప్రసాద్, జోనల్ చైర్మన్‌గా శోభారాణిని నియామించారు. సమాజ హితమైన, ప్రజాప్రయోజనకరమైన కార్యక్రమాలు నిర్వహించడంలో హర్షవల్లి లయన్స్ క్లబ్ ఎప్పుడూ ముందుంటుందని హారికా ప్రసాద్ అన్నారు. ఒకే క్లబ్‌కు 2024-25 సంవత్సరానికి గాను రెండు ఉన్నత పదవులు దక్కడం హర్షణీయమని తెలిపారు. ఇందుకు లయన్స్ ఇంటర్ నేషనల్ 316ఎ వారికి కృతజ్ఞతలు తెలుపున్నట్టు కెఎన్.ఎస్.వి ప్రసాద్ (హరికా ప్రసాద్) లయన్స్ ఇంటర్నేషనల్ 316ఎ జిల్లా చైర్మన్ అన్నారు. అనంతరం 2024-25 సంవత్సరానికిగానూ నూతన కార్యవర్గ ఎంపిక నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడుగా లయన్ వావిలావల్లి జగన్నాధనాయుడును సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హారికా ప్రసాద్ మాట్లాడుతూ సేవా రంగంలో హర్షవల్లి లయన్స్ క్లబ్ బాధ్యత మరింత పెరిగిందన్నారు. బుధవారం ఉదయం స్థానిక హర్షవల్లి లయన్స్ క్లబ్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన లయన్ కరణం శోభారాణి మాట్లాడుతూ 2024-25 సంవ్సతరానికిగానూ జోనల్ చైర్మన్ గా తనను నియమించినందుకు లయన్స్ ఇంటర్నేషనల్ 316ఎ కు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. సర్వసభ్య సమావేశంలో ఎన్నిక పరిశీలకులుగా డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, ఎమ్.జె.ఎఫ్‌లు వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 316ఎ లయన్ జిల్లాకు లయన్ శోభారిణి జోనల్ చైర్మన్ గా, లయన్ శ్రీ కె.ఎన్.ఎస్.వి ప్రసాద్ (హరికా ప్రసాద్) కు జిల్లా చైర్మన్ గా 2024-25 సంవత్సరానికి నియమిస్తూ అధికారక ఆదేశాలు వెలువడ్డాయని వివరించారు. వీరిరువురు హర్షవల్లి లయన్స్ క్లబ్ కు అందించిన సేవల ద్వారా లభించిన గౌరవంగా దీనిని భావించాలని చెప్పారు.

- నూతన కార్యవర్గం...

అధ్యక్షులుగా: లయన్ వావిలపల్లి జగన్నాథ నాయుడు, కార్యదర్శిగా లయన్ మణిశర్మ, కోశాధికారిగా లయన్ లక్ష్మికాంత్, ఉపాధ్యాక్షులు -1 లయన్ తర్లాడ అప్పలనాయుడు, ఉపాధ్యక్షులు -2 : లయన్ పలిశెట్టి మధుబాబు, ఇతర పదవుల్లో ఉషారాణి కల్లెవల్లి, శిరీష చింతాడ, వెంకునాయుడు అప్పరబోతు, మజ్జి సుమన్‌లను ఎన్నుకున్నారు.

ఘనంగా మాజీ మంత్రి గౌతు శివాజీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-పలాస : పలాస టిడిపి కార్యాలయంలో బుధవారం మాజీ మంత్రి గౌతు శ్యాం సుందర్ శివాజీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాశీబుగ్గ సాయిరాం గుడి, పలాస త్రినాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా దేవాలయాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.గౌతు శివాజీ, విజయమ్మ దంపతులకు దుస్సాలువ కప్పి సన్మానం చేశారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, పీరుకట్ల విఠల్ రావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, టంకాల రవి శంకర్ గుప్తా, దువ్వాడ శ్రీకాంత్, దువ్వాడ హేంబాబు చౌదరి, కొర్ల కన్నారావుమల్లా శ్రీనివాసరావు, బి నాగరాజు, దానేటి పద్మజీ, యవ్వరి మోహనరావు, డొక్కరి శంకర్, కొరికాన శంకర్, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

26న శ్రీ అన్నపూర్ణమ్మ గ్రామదేవత ఆలయ వార్షికోత్సవం



విశాలాంధ్ర-మందస : మందస గ్రామ ఇలవేల్పు శ్రీఅన్నపూర్ణమ్మ గ్రామ దేవత ఆలయ 14వ వార్షికోత్సవం ఈనెల 26న ఆలయ ప్రాంగణంలో నిర్వహించ బడుతుందని ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ప్రకటనలో తెలిపారు. 26 ఉదయం 7 గంటలకు ప్రత్యేక హెూమం, 8 గంటలకు మందస దేవాంగుల వీధి నుంచి గ్రామ దేవత గుడి వరకు ముర్రాటలతో ఊరేగింపు అనంతరం గ్రామ దేవతకు భక్తులచే చల్లదన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. మధ్యాహ్నం 11 గంటల నుండి నారాయణ సేవ కార్యక్రమం జరుగునని, భక్తులు గ్రామ ప్రజలు అందరూ హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆధ్యాత్మిక స్ఫూర్తి ప్రదాతకు ఘన సత్కారం

విశాలాంధ్ర-పొందూరు: ఆధ్యాత్మిక పరిడవెళ్లే పొందూరు లో ఉన్న అనేక దేవాలయాలకు తనదైన శైలి లో దైవసేవ స్ఫూర్తి ప్రదాతగా గుర్తింపు పొందిన కాళ్ల గోవిందకు బుధవారం స్థానిక శ్రీకంచికామాక్షి ఏకాంబరేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్క రించారు. ఈ ఆలయం ఆవరణలో తాగునీటి గొట్టపు బావి, విద్యుత్ మోటారు, పైపు లైన్ నిర్మాణానికి రూ.82వేల మొత్తాన్ని ఈ సందర్భంగా గోవింద అందజేశారు. ఇంకా స్థానికంగా ఉన్న పైడితల్లి అమ్మవారి ఆలయానికి హుండీతో పాటు భక్తులకు వేసవి తాపాన్ని నుండి సహకరించాలన్న సదుద్దేశంతో కూల్ వాటర్ ట్యాంక్ను ఆయన బహూకరించారు. స్థానిక అయ్యప్ప స్వామి వారి ఆలయానికి కూల్ వాటర్ ట్యాంకుతో పాటు ఆలయ నిర్మాణానికి అవసరమైన సిమ్మెంటును అందించారు. స్థానిక మహారాజా మార్కెట్ ఆవరణలలో వెలసి ఉన్నకోదండ రామస్వామి పురాతన ఆలయానికి బహు సుందరంగా తయారు చేసే దశగాభారీ ఎత్తున రంగులు వేయించే కార్యక్రమం చేపట్టారు. స్థానిక చెల్లూరు వారి వీధిలో వెలసి ఉన్నజగత్ జననీ లోక విక్షేతమాతగా ఇక్కడ ప్రజలను ఆదరిస్తున్న తొల్లేటి పైడితల్లి అమ్మవారి ఆలయానికి హుండీని అందజేశారు. ఎర్ర వారి తోటలో వెలసి ఉన్న శివాలయానికి హుండీని సమర్పించిన ఆధ్యాత్మిక సేవకుడు కాళ్ళ గోవిందకు అభినందిస్తూ ఘనంగా సత్కరించారు.

వైభవంగా ముగిసిన బారువ అమ్మవారి సంబరాలు

విశాలాంధ్ర-సోంపేట: ఈ మండలం బారువ మేజర్ పంచాయతీలో శ్రీశయన సంఘం ఆధ్వర్యంలో ఐదు రోజులుగా చేపట్టిన పెద్దమ్మతల్లి సంబర మహోత్సవాలు అంగరంగ వైభవంగా మంగళవారం రాత్రితో ముగిసాయి. సంబరాలను శ్రీశయన కుటుంబాల ప్రజలు భక్తిశ్రద్ధలతో ఎంతో ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని గ్రామంలోకి ఆహ్వానించడం, గ్రామంలో అమ్మవారి తిరువీధులు నిర్వహించడం, వీధినాటకాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, బాణాసంచా కాల్పులతో విద్యుత్ అలంకరణలతో బారువపేట ఎంతో శోభయమానంగా అందరినీ ఆకట్టుకుంది. అమ్మవారి సంబరాలకు ఐదు రోజుల పాటు చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

విజయ్‌మోహన్ కు అభినందనలు





విశాలాంధ్ర-బొబ్బిలి: విజయ మోహన్ కు జాతీయ స్థాయి ఇండియన్ ఐకాన్ అవార్డ్ రావడం మంచి స్ఫూర్తిదాయక మని రాష్ట్ర ఆంగ్ల భాషో పాధ్యాయుల సంఘం (డెల్టా) గౌరవ అధ్యక్షులు ఎం. గుంప స్వామి బుధవారం అన్నారు. మార్చి నెలలో ఇండియా టుడే మీడియా ఆన్లైన్లో ఎంపిక చేసిన వివిధ రంగాల ప్రతిభా వంతులలో విద్యార్థుల ఆంగ్ల భాష విద్యాభివృద్ధికి చేస్తున్న కృషికి గాను పంపిన మేమొంటోను, సర్టిఫికేట్ ను ఈ సందర్భంగా విజయ మోహన్ కు డెల్టా సభ్యులు ఎం.రామకృష్ణ, పి శ్రీనివాస , ఎం. మురళీ బాబు, ఎస్. జగన్ మోహన్ సమక్షంలో అందించారు.

మాజీ మంత్రి కృష్ణదాస్ చినమామ మృతి

నివాళులర్పించిన కృష్ణదాస్, డిసిసిబి చైర్మన్

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని వావిలపాడులో శ్రీకాకుళం జిల్లాకు చెందిన మాజీ మంత్రి, వైసీపీ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ చినమామ, సీనియర్ నాయకులు గండి తాతయ్యలు నాయుడు(80) బుధవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన మృతి చెందినట్లు సమాచారం అందుకున్న మాజీ మంత్రి కృష్ణదాస్ , డిసిసిబి చైర్మన్ వేచలపు వేంకట చిన రాము నాయుడు, నీలకంఠరాజపురం ఉప సర్పంచ్ కండిపల్లి పెదనాయుడు, పిఏసిఎస్ అధ్యక్షులు వేచలపు రామ్మూర్తి నాయుడు, డైరెక్టర్ వేచలపు నానబాబు, చినగుడిపాల సర్పంచ్ బోజంకి రామునాయుడు తదితరులు మృతుడు తాతయ్యలు నాయుడుకు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు బంధుమిత్రుల అశ్రు నయనాల నడుమ బుదవారం సాయంత్రం గ్రామంలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరిపారు.